క్లుప్తంగా

రేపు ఓజోన్ దినోత్సవంపై అంతర్ కళాశాలల పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఈనెల 13న ఏఎన్‌యూ అంతర్ కళాశాలల స్థాయిలో వక్తృత్వ పోటీలను పట్టాభిపురంలోని టీజేపీ ఎస్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ''ఓజోన్ క్షీణతకు గురి చేసే పదార్థాలను తగ్గించే నూతన పరిష్కార మార్గాలు'' అనే అంశంపై ఐదు నిముషాలకు తగ్గకుండా మాట్లాడాలని సూచించారు. పోటీలకు ప్రతి కళాశాల నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థుల పాల్గొనవచ్చునని, విజేతలకు తొలి మూడుస్థానాల్లో బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. అదే విధంగా పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ప్రశంసాపత్రం అందిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ (98498 54221)ను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కామెల్ జాతీయ ప్రదర్శనకు ఏఎన్‌యూ విద్యార్థి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థి సోనుదాస్ క్యామెల్ కంపెనీ నిర్వహిస్తున్న జాతీయ క్యాంప్, చిత్ర ప్రదర్శనకు ఎంపికయ్యాడు. కర్ణాటక రాష్ట్రం హంపిలో నవంబర్ 25 నుంచి 29 వరకు ఈ క్యాంప్ కొనసాగుతుంది. ఈ క్యాంప్‌లో ఎంపిక చేయబడ్డ వర్ణ చిత్రాలు వచ్చేయడాది జనవరిలో ముంబాయి జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.గంగాధర రావు విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి. శేఖర్ బాబు, అధ్యాపకులు పి. దేవకాంత్ పాల్గొన్నారు.

బ్లేడుతో దాడి

పట్నంబజారు: వ్యక్తిపై బ్లేడుతో దాడి చేసి గాయపరిచిన సంఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసుల కథనం ప్రకారం.. కేవీపీ కాలనీకి చెందిన సురేందర్ షఫీ అనే యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య వచ్చిన స్వల్ప వివాదాల నేపథ్యంలో షఫీని సురేందర్ కొట్టాడు. ఈ విషయాన్ని అడిగేందుకు వచ్చిన షఫీ సోదరుడు ఫయాజ్‌ను సురేందర్ బ్లేడుతో దాడి చేసి గాయపరచగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు 'అక్షయ' విరాళం

ప్రత్తిపాడు: విజయవాడలో ముంపునకు గురైన వరద బాధితుల సహాయార్థం ప్రత్తిపాడు అక్షయ విద్యాలయం తమవంతుగా విరాళం అందించింది. రూ. 15 వేల నగదును సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపినట్లు బుధవారం పాఠశాల చైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.

డ్వాక్రా మహిళల విరాళం

పెదకాకాని: విజయవాడ వరద బాధితులకు డ్వాక్రా సంఘాల నుండి 5,59,350 రూపాయలు వసూలు చేసినట్లు డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం బచ్చల రాజు తెలిపారు. ఒక్కొక్కరి వద్ద నుంచి 50 రూపాయల చొప్పున 1115 మంది వద్ద 5,59,350 రూపాయలు వసూలు చేయడం జరిగిందన్నారు.

నేడు పెదకాకానికి కేంద్ర బృందం

పెదకాకాని: అధిక వర్షాలు, వరదల కారణంగా సంభవించిన పంట నష్టాన్ని పరిశీలించేందుకు బుధవారం సెంట్రల్ టీం పెదకాకాని మండలంలో సందర్శించనున్నట్లు ఎంపీడీఓ బివి మల్లేశ్వర రావు తెలిపారు. పెదకాకాని మండలంలో గురువారం ఉదయం 9:40 గంటలకు పెదకాకాని రక్షిత మంచినీటి చెరువు, 9:55 గంటలకు పెదకాకాని సమీపంలోని గుంటూరు ఛానల్, 10:10 గంటలకు వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్ల వారిపాలెం ప్రాంతాల్లో ముంపుకు గురైన పంట పొలాలను సందర్శిస్తారన్నారు.

సంప్రదాయ ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రత్తిపాడు: సంప్రదాయ పద్ధతిలో ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోషకాహారం ఆవశ్యకత, పోషకాహార లోపం వలన ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, రక్తహీనత.. వంటి పలు విషయాలపై వివరించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే ఆహార పదార్థాలు తినడం వలన జీర్ణకోశ సంబంధిత వ్యాధులు సోకుతాయన్నారు. ఖాళీ నివేశన స్థలాలు ఉన్నవారు ఆకుకూరలు, కూరగాయలు సేంద్రియ విధానం ద్వారా పండించి తినడం వలన బహుళ ప్రయోజనాలుంటాయన్నారు. అదేవిధంగా చిరుధాన్యాలతో చేసే పల్లీ ఉండలు, నువ్వుల లడ్డూలు, శనగ గుగ్గిళ్లు ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం బి. శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.యమున, బి. స్వాతి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జేబుదొంగల హల్‌చల్

మాజీ సీఎం జగనన్న గుంటూరు పర్యటనలో జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్, విజయవాడ డిప్యూటీ మేయర్ శైలజ భర్త శ్రీనివాస రెడ్డిని టీడీపీ అక్రమ కేసుల్లో అరెస్ట్ చేయగా, వారిద్దరిని చూసేందుకు వైఎస్ జగన్ గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కారాగారానికి వచ్చారు. ఈ క్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. తమ అభిమాన నేతతో కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో పెదకాకాని కంతేరు గ్రామంలో అంబేద్కర్ నగర్ నుంచి పలువురు మహిళలు ఉమ్మడిగా జగన్‌ను చూసేందుకు వచ్చారు. వీరిలో ఎం.ప్రేమకుమారి మెడలోని మంగళ సూత్రాన్ని ఓ యువకుడు లాగగా, వెంటనే గుర్తించిన మహిళలు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి అరండల్‌పేట పోలీసులకు అప్పగించింది. పట్టుబడిన యువకుడిని పోలీసులు విచారిస్తున్నారు. ములాఖత్ ముగించుకుని జగన్ బయటకు వచ్చిన క్రమంలో అరండల్‌పేట ప్రధాన రహదారిలో వెళ్తున్న ఓ వ్యక్తి జేబులోని పర్సును మరో యువకుడు దొంగలించే ప్రయత్నం చేశాడు. ఈ హఠాత్ పరిణామంతో తేరుకున్న వ్యక్తి సదరు యువకుడిని గుర్తించి అరండల్‌పేట పోలీసులకు అప్పగించారు. – నగరంపాలెం



మంగళ సూత్రం దొంగలించిన యువకుడిని తీసుకెళ్తున్న అరండల్‌పేట పోలీసులు



తన మెడలో బంగారం చోరీకాకుండా నిలువరించి దొంగను పట్టించిన ప్రేమకుమారి



పర్సు దొంగిలించేందుకు యత్నించిన మరో యువకుడిని పట్టుకున్న పోలీసులు

షార్‌ను సందర్శించిన అంకిరెడ్డిపాలెం జెడ్పీ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (షార్)ను సందర్శించారు. అమరావతి రోడ్డులోని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ రాత్రి షార్‌కు ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో కూడిన బృందం మంగళవారం షార్‌ను సందర్శించిన అనంతరం బుధవారం గుంటూరు చేరుకున్నారు. ఈసందర్భంగా శాంతమూర్తి మాట్లాడుతూ పాఠశాలస్థాయిలోని విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా కృషి చేస్తున్నామని చెప్పారు. షార్ సందర్శనలో భాగంగా గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ అక్కడి విశేషాలను విద్యార్థులకు వివరించారని తెలిపారు.



షార్‌లో అంకిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో శాంతమూర్తి, ఉపాధ్యాయులు

1966లో ఇస్రో ఆవిర్భావం మొదలుకుని చంద్రయాన్–3, మానవ రహిత రాకెట్లను పంపడంతో పాటు 2025 నాటికి వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని వివరించారు. షార్ సందర్శనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అద్భుతమైన అనుభూతితో పాటు సంభ్రమాశ్చరాలకు లోనయ్యారని తెలిపారు.

జీవనశైలిలో మార్పులతో శారీరక సమస్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవనశైలిలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా శారీరకంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ నాగ సతీష్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులో హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలోని స్కూల్ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నాగ సతీష్ మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన ఉద్యోగం, విధి నిర్వహణ కారణంగా వెన్నెముక, మెడ భాగాల్లో గతంలో లేనన్ని సమస్యలు వస్తున్నాయని చెప్పారు. శారీరకంగా మార్పులు చేసుకోవడంతో పాటు చిన్నపాటి వ్యాయామం ద్వారా వాటిని అధిగమించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దంత వైద్య నిపుణురాలు ప్రత్యూష మాట్లాడుతూ ఆధునిక స్పీడ్ యుగంలో యువత ఆహారాన్ని ప్రశాంతంగా తినడం లేదని, నోరు పరిశుభ్రత పాటించని కారణంగా ఎదురవుతున్న సమస్యలను వివరించారు, దంత క్షయాన్ని నివారించుకోవడం, నోటి పరిశుభ్రత పాటించడాన్ని పలు చిట్కాలతో తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ



నాగ సతీష్, ప్రత్యూషను సత్కరిస్తున్న ఎస్వీ రమణ, చక్రవర్తి

విద్యార్థులకు పాఠ్యాంశ ఆధారిత విజ్ఞానంతో పాటు ప్రాక్టికల్, క్షేత్రస్థాయిలో పర్యటనలు, ఆయా రంగాల వృత్తి నిపుణులతో అతిథి ఉపన్యాసాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి. కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, ఏ. బాజీబాబు, ఎన్. మణికంఠ, బి. అనిత, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.20 వేలు నష్టపరిహారమివ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్

పెదకాకాని: వరదలతో పంట నష్టపోయిన ప్రతి రైతులకు ఎకరానికి 20 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. కాలువ కట్టలకు గండ్లు పడి గత పది రోజులుగా వరి పైర్లు నీటిలోనే మునిగి దెబ్బతిన్న ప్రాంతాల్లో బుధవారం సీపీఎం నాయకులు సందర్శించారు. పెదకాకాని, దుగ్గిరాల, తెనాలి రూరల్ మండల ప్రాంతాల్లో తిరిగి వరి పొలాలను బుధవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండలంలోని ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, నంబూరు, దేవరామబొట్లవారిపాలెం, తంగెళ్ళమూడి గ్రామల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ అధిక వర్షాలు, వరదల కారణంగా గుంటూరు చానల్, హైలెవల్ చానల్, మురుగుకాలువ కట్టలు తెగి పొలాలు చెరువులుగా మారాయన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నీరు పొలాల్లోనే ఉండి అందులో



దేవరాయబొట్లవారిపాలెంలో రైతులతో కలసి వరిపైరును పరిశీలిస్తున్న రామారావు

మునిగి ఉన్న పైరు కుళ్ళి దెబ్బతిందన్నారు. పంట కాలువలపై నియంత్రణ లేకుండా అధికారులు పనిచేస్తున్నారన్నారు. పంట నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు పరిశీలించి పంట నష్టం అంచానా వేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, రాజారమేష్, వసంతరావు, రాంబాబు, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

శభాష్.. భావన శౌర్య

- అభినందించిన భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ
- రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో కళాశాల విద్యార్థిని ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: భాష్యం విద్యార్థులు చదువులోనే కాకుండా ఇతర రంగాల్లో సైతం ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించిన భాష్యం మెడెక్స్ విద్యార్థిని వంకాయలపాటి భావనశౌర్యను రామకృష్ణ అభినందించారు. జూన్ 23న గచ్చిబౌలీలోని హైదరాబాద్ యూనివర్శిటీలో రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ సీనియర్, జూనియర్ 50 మీటర్ల విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన భావనశౌర్య



భావనశౌర్యను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

చాంపియన్‌షిప్ చేజిక్కుంచుకుందని వివరించారు. అదే విధంగా 2022లో 10 మీటర్ల విభాగంలో సబ్ యూత్ జూనియర్, సీనియర్ విభాగాల్లో రజతం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 2023లో నిర్వహించిన అండర్–19 పది మీటర్ల రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్‌లో పాల్గొని మన రాష్ట్రం తరఫున ప్రాతినిథ్యం వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు పాల్గొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

తెనాలిరూరల్: అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి టి.అనంతాచార్యులు అన్నారు. స్థానిక మారీసుపేటలో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అగ్ర నాయకుడిగా లోక్‌సభలో ప్రతిపక్ష హోదాలో ఉన్న రాహుల్ గాంధీ అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ఆర్ఎస్ఎస్, బీజేపీలు మహిళలపై చిన్న చూపు కలిగి ఉన్నాయని మాట్లాడటం బాధాకరమని అన్నారు. విదేశాలకు వెళ్లినప్పుడు మాతృదేశం గురించి మంచి మాటలు మాట్లాడాలి కానీ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టమన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు, తెనాలి మండల అధ్యక్షుడు కడియాల నంద కిషోర్, గుంటూరు పార్లమెంట్ అధ్యక్షుడు కఠారి వాసుదేవ నాయుడు పాల్గొన్నారు.

అనధికార హోర్డింగ్స్‌పై కన్నెర్ర

- తొలగించిన కార్పొరేషన్ సిబ్బంది
- ఫీజులు చెల్లించని, అనుమతి లేని బోర్డులు తొలగిస్తాం
- హెచ్చరించిన కమిషనర్

నెహ్రూనగర్: పట్టణ ప్రణాళిక అధికారులు కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఫీజులు చెల్లించని, అనధికార హోర్డింగ్‌లు, బోర్డులను, ఫ్లెక్సీలను తొలగించారు. అనధికార బోర్డులు, హోర్డింగ్స్ నగరంలో ఉండడానికి వీలు లేదని, అటువంటి వాటిని ఎప్పటికప్పుడు తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులు స్పెషల్ టీంను అందుబాటులో ఉంచాలని సిటీ ప్లానర్‌ని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ అనుమతితో నగరంలో ఏర్పాటు చేసిన ప్రతి ప్రకటన బోర్డ్ నిర్దేశిత మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు చెల్లించాలని, ఫీజులు చెల్లించని, అనుమతి లేని బోర్డులను తొలగిస్తామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ స్పష్టం చేశారు. నగరంలో నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్రకటనల హోర్డింగ్స్ యాజమానులు మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు సక్రమంగా చెల్లించాలని, లేకుంటే సదరు బోర్డులను తొలగించి, ఫీజుల వసూళ్లకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు అనధికార హోర్డింగ్, ఫీజులు చెల్లించని వాటిని తొలగించామన్నారు. నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా ప్లానింగ్ కార్యదర్శులు అనధికార, ఫీజులు చెల్లించని బోర్డులను గుర్తించి, వాటిని తొలగించాలన్నారు.



అనధికార బోర్డులు తొలగిస్తున్న దృశ్యం

నగరంలో ఇష్టానుసారంగా రోడ్లకు అడ్డుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని, వాటిని కూడా తొలగించాలన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్ల విస్తరణ చేస్తున్నామని, కొందరు రోడ్ల మీద వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కి అంతరాయం కల్గిస్తున్నారన్నారు. రోడ్, ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపులో రాజీ పడకూడదన్నారు. ప్రకటనల బోర్డ్‌ల నిర్వాహకులు తప్పనిసరిగా బకాయిలతో పాటుగా ప్రస్తుత ఏడాది డిమాండ్ కూడా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు అజయ్ కుమార్, మురళీ టీపీఎస్‌లు సువర్ణ కుమార్, లక్ష్మణస్వామి, టీపీబీఓలు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

భర్తపై దాడిచేసిన భార్యపై కేసు

పట్నంబజారు: భర్తను కొట్టి బిడ్డను ఎత్తుకెళ్లిన ఘటనలో భార్య, ఆమె బంధువులపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్వర్ణాంధ్రనగర్‌కు చెందిన అంబేద్కర్‌కు గత 12 ఏళ్ల క్రితం పెదకూరపాడుకు చెందిన రోజా మేరితో వివాహమైంది. వారికి అభినవ్ అనే కుమారుడు ఉన్నాడు. భార్యభర్తల మధ్య వివాదం నేపథ్యంలో ఇరువురు వేర్వేరుగా ఉంటున్నారు. అయితే అభినవ్ తన తండ్రి వద్ద ఉంటున్నాడు. ఈక్రమంలో బుధవారం చంద్రమౌళినగర్‌లోని భాష్యం స్కూల్ వద్ద అభినవ్‌ను దింపేందుకు వెళ్లిన తండ్రి అంబేద్కర్‌పై రోజా రాణి, ఆమె బంధువులు దాడిచేసి గాయపరిచి బాలుడిని తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా దూసుకెళ్లి ఆటో ప్రయాణికులకు గాయాలు

పట్నంబజారు: వినాయక చవితి నిమజ్జన కార్యక్రమంలో అపశృతి చోటు చేసుకుంది. తెలిసిన సమాచారం మేరకు నల్లచెరువులోని వినాయకుడి విగ్రహ మహోత్సవ కార్యక్రమంలో బాణాసంచా కాలుస్తున్న సమయంలో బాణా సంచా ఆటోలోకి దూసుకెళ్లి పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

అనాథ శవానికి అంతిమ సంస్కారాలు

తెనాలి: పట్టణ స్వరాజ్ టాకీస్ సెంటర్లోని సాయిబాబు గుడి వద్ద మూడు దశాబ్దాలుగా భిక్షాటనతో జీవనం సాగిస్తున్న వృద్ధుడు మంగళవారం రాత్రి పొద్దుపోయాక మృతి చెందాడు. అతడు అనాథ కావటంతో సాయిబాబా గుడి కమిటీ విజ్ఞప్తి మేరకు పట్టణానికి చెందిన శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం అంత్యక్రియలు చేశారు. సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, సభ్యులు కలిసి, యాచకుడి మృతదేహాన్ని బుర్రిపాలెంరోడ్డులోని మహాప్రస్థానానికి తరలించారు. సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు. శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవా సమితి అనాథ శవాలకు చేస్తున్న అంతిమ సంస్కార సేవలను మహాప్రస్థానం సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ అభినందించారు.

వాగులకు కాంక్రీట్ వాల్స్ ఏర్పాటు చేయాలి

గుంటూరు మెడికల్: అకాల వర్షానికి నష్టపోయిన రైతులను, పొలాలను బీజేపీ నేతలు పరిశీలించారు. బుధవారం వట్టిచెరుకూరు మండలంలో వట్టిచెరుకూరు నుంచి ముట్లూరు మార్గంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.పాండురంగ విఠల్ బృందం పర్యటించారు. వాగులు పొంగి పంట పొలాలు దెబ్బతింటున్నాయి, రహదారులు కోతకు గురవడం, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలన్నా కష్టంగా మారుతోందన్నారు. రహదారికి మరమ్మత్తులు చేయాలని కోరారు. అప్పాపురం చానల్, జల్లవాగు, కొండవీటి వాగులు పొంగి పొర్లడం వల్ల పంట పొలాలు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అధికారులు వెంటనే స్పందించి వాగులకు కాంక్రీట్ వాల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. పూడిక తీసి ముళ్ళ చెట్లను పీకించి నీటి ప్రవాహానికి అడ్డులేకుండా ముందుకు వెళ్లే విధంగా



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వి.రమేష్, టి.కృష్ణారెడ్డి, శోభన్ బాబు, దూపాటి శ్రీనివాసరావు, వీరయ్య, రూరల్ మండల అధ్యక్షుడు కంచర్ల రాజేష్, డి.యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

బీజేపీ నేత వల్లూరు జయప్రకాష్ నారాయణ

గుంటూరు మెడికల్: సమాన అవకాశాలతోనే నూతన భారతం ఆవిర్భవిస్తుందని .. ఎలుగెత్తి చాటిన దేశభక్తుడు స్వామి వివేకానంద అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ అన్నారు. స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకుని దేశభక్తి కలిగి ఉండాలని సూచించారు. బుధవారం స్థానిక పట్టాభిపురంలోని వివేకానంద సర్కిల్ వద్ద దేశ్ ప్రేమీ సేవా సంఘటన్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరెడ్డి అధ్వర్యంలో 131వ చికాగో నగరోపన్యాసదినోత్స వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతను చైతన్య పరచి,ఆత్మ



మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

స్థైర్యాన్ని కలిగించారన్నారు.
జీవిత సమస్యలను, ఒత్తిళ్లను అధిగమింప జేసి విజేతను చేసేలా ఆయన ఉపన్యాసం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చెరుకూరి తిరుపతిరావు, కంతేటి బ్రహ్మయ్య, తోట శ్రీనివాసరావు, రాజేష్ నాయుడు, ప్రతాప ప్రసాద్, జితేంద్ర గుప్తా, ముత్యం నరేంద్ర పాల్గొన్నారు ..

భూ రికార్డులు సరిచేయాలని రైతుల వినతి

తెనాలిరూరల్: తమ భూములు రెవెన్యూ రికార్డుల్లో దేవదాయ శాఖ భూములుగా కనబడుతున్నాయని, వెంటనే సరిచేయాలని తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన సుమారు 60 మంది రైతులు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను బుధవారం రాత్రి కలసి విజ్ఞప్తి చేశారు. 1930 నుంచి గ్రామ పరిధిలోని భూములు తమ పేరిట ఉన్నాయని, అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల పత్రాలు, పాస్‌పుస్తకాలు తమ వద్ద ఉన్నాయని తహసీల్దార్‌కు విన్నవించారు. తమ భూములను 2019లో దేవాయ శాఖ అధికారులు ఆ శాఖకు చెందిన భూములంటూ గ్రామస్తుల దృష్టికి తీసుకొచ్చారని, ఎవరికి ఎటువంటి నోటీసులివ్వకుండా రెవెన్యూ శాఖతో కలసి భూములను దేవదాయ శాఖకు చెందినవిగా రికార్డుల్లో మార్పులు చేశారని



తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తెలిపారు. దీనిపై చర్యలు తీసుకుని రికార్డుల్లో మార్పులు చేయాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. దీనికి తహసీల్దార్ సమాధానమిస్తూ రైతుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తనని, ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

డ్రాపౌట్స్‌ని నివారించాలి

సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి

ప్రత్తిపాడు: విద్యార్థుల డ్రాపౌట్స్ లేకుండా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ఏపిసి జి. విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపిసి బుధవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. రెండు రోజుల కన్నా అదనంగా విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరైతే తల్లిదండ్రులకు ఫోన్ చేసి తమ పిల్లలు ఎందుకు పాఠశాలకు హాజరు కావడం లేదో తెలుసుకోవాలన్నారు. బడి మధ్యలో పిల్లలు మానివేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అలానే మరింత నాణ్యతతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎండీఎం నాణ్యతను పరిశీలించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని ఏపీసీ తనిఖీ చేశారు. రిజిస్టర్లును పరిశీలించి, హౌసింగ్ లే అవుట్‌ను సందర్శించారు. వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

(గుంటూరు ఈస్ట్)

90109 57733

Office mail : sakshigntadvt@gmail.com